ప్రజాశక్తి

బుధవారం 31 జనవరి 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

వార్త మెయిన్‌లో





పల్నాడులో రెచ్చిపోయిన వైసిపి శ్రేణులు

200 మంది కర్రలతో ప్రదర్శన.. దాడి

కౌలు కోసం 8 నెలలుగా

రాజధాని రైతులకు దక్కని సాయం - కొనసాగుతున్న న్యాయ పోరాటం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని రైతులకు వార్షిక కౌలు చెల్లింపుల్లో ఏడునెలలుగా జాప్యం జరుగుతోంది. తమకు కౌలు చెల్లింపులు చేయాలని పలువురు రైతులు దాఖలు చేసిన పిటీషన్‌పై ఇటీవల హైకోర్టులో విచారణ జరిగింది. కౌలు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ గత నెలలో హైకోర్టు కేసును ఫిబ్రవరి నెలకు వాయిదా వేసింది. 2015లో భూ సమీకరణలో రాజధాని నిర్మాణం నిమిత్తం తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాల పరిధిలోని 29 గ్రామాలకు చెందిన 22,948 మంది రైతులు 33 వేల ఎకరాల భూమిని అప్పగించారు. వీరిలో కౌలు చెల్లింపునకు అర్హత కలిగిన భూముల్లో 28,128 ఎకరాలకు ఏటా రూ.183.17 కోట్లు కౌలు పరిహారం చెల్లించాల్సి ఉంది. 2019 వరకు ప్రతి ఏటా మేనెలలోనే కౌలు చెల్లించారు. 2020 నుంచి జాప్యం జరుగుతూ వస్తుంది. 2021, 2022లో కొంత జాప్యంజరిగినా ఎట్టకేలకు చెల్లించారు. 2023 మే నెలలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మీ కౌలు చెల్లింపునకు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఇంత వరకుఈ నిధులను రైతుల ఖాతాల్లో జమచేయలేదు. ఎనిమిది నెలలుగా సిఆర్‌డిఎ అధికారులను కలుస్తున్నా సానుకూల ఫలితం లేదని రైతులువాపోతున్నారు.

2016 నుంచి 2019 వరకు మే నెలలో ప్రభుత్వం కౌలు చెల్లించింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత 2020 నుంచి ప్రతి ఏటా జూన్ నుంచి ఆగస్టులోగా జమ చేస్తూ వచ్చారు. గత ఏడాది మే నెలలోనే ఉత్తర్వులు ఇచ్చినా ఇంత వరకు రైతుల ఖాతాల్లో వార్షిక కౌలు జమకాలేదు. సిఆర్‌డిఎకి భూములు అప్పగించిన రైతులకు 10 ఏళ్లపాటు ఏటా 10 శాతం పెంచేలా అప్పటి టిడిపి ప్రభుత్వం రాజధాని రైతులకు కౌలు సాయం ప్రకటించింది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30 వేలు, మూడు పంటలు పండే జరీబు భూముల రైతులకు ఎకరాకు రూ.50వేలు కౌలు అప్పటి టిడిపి ప్రభుత్వం నిర్ధారించింది. ఈ మొత్తంపై ప్రతిఏటా 10 శాతం సొమ్ము పెంచి రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

2లో

సెంటు భూముల రిజిస్ట్రేషన్‌పై రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో సెంటు స్థలం రిజిస్ట్రేషన్ వ్యవహారంపై రైతులు మండిపడుతున్నారు. రాజధానిలో ఇళ్ల స్థలాల పంపిణీకి సంబంధించి ఏర్పాటు చేసిన ఆర్ - 5 జోన్ అంశం కోర్టు పరిధిలో ఉండగా ప్రభుత్వం సెంటు స్థలాల రిజిస్ట్రేషన్‌కు జీవో జారీ

2లో



తుళ్లూరు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు, మహిళలు

కొత్త పనులకు నిధుల్లేవు..!

- అభివృద్ధి పనులపై ప్రగతి నివేదిక ఇవ్వాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా
- సమావేశానికి జెడ్పీటీసీకి బదులు భర్త హాజరు



మాట్లాడుతున్న కత్తెర హెనీ క్రిస్టినా

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా పరిషత్ నిధులతో చేపట్టి పనులకు సంబంధించి పురోగతిపై ఆయా శాఖలు నివేదిక ఇవ్వాలని అధికారులను జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా కోరారు. మంగళవారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించారు. చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధ్యక్షతన ప్రణాళిక-ఆర్థిక అంశాలు, గ్రామీణాభివృద్ధి, విద్య-వైద్యం, పనులకు సంబంధించిన నాలుగు సమావేశాలు నిర్వహించారు. జెడ్పీ నుండి దాదాపు రూ.5 కోట్ల విలువైన పనులు మంజూరు చేశామని, అయితే అవి ఏయే దశల్లో ఉన్నాయో తెలియదన్నారు. కావున పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇతర శాఖలు ప్రగతి నివేదిక ఇవ్వాలన్నారు. పనులకు సంబంధించిన స్థాయి సంఘంలో పలువురు జెడ్పీటిసిలు అభివృద్ధి పనులు మంజూరు చేయాలని కోరారు. మేడికొండూరు జెడ్పీటీసీ

2లో

పత్తి గోదాములో మంటలు



ప్రజాశక్తి - క్రోసూరు

మండల కేంద్రమైన క్రోసూరులోని పోలీస్‌స్టేషన్ దారిలో ఉన్న ఓ పత్తి గోదాములో మంగళవారం మంటలు రేగి అందులోని పత్తి పంట దగ్ధమైంది. దీంతోపాటు పక్కనే ఉన్న పాత సామాన్లు కూడా కాలిపోయాయి. ప్రమాద స్థలికి క్రోసూరు, పెదకూరపాడు నుండి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని ఇన్‌ఛార్జి ఆఫీసర్ ఎన్.సుబ్బారావు ఆధ్వర్యంలో 14 మంది సిబ్బంది మంటలను అదుపు చేశారు. షేక్ పెదకూరపాడు సైదా నివాసం వద్ద పత్తి గోడౌను, పాత సామాన్లు గోడౌన్లు 25 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. తాజా ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా? లేదా అంత్యక్రియల సందర్భంగా పేల్చిన బాణసంచా వల్ల జరిగిందా? అనేది ఇంకా నిర్ధారణ కాలేదు. ప్రమాదంలో రూ.18 లక్షల పత్తి, రూ.2 లక్షల సామాను, మొత్తంగా రూ.20 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు గోడౌన్ నిర్వాహకులు చెబుతున్నారు.

ఎన్నికల్లో బిజెపిని ఓడించాలి : సిపిఎం

16న కార్మిక, రైతు, ప్రజా సంఘాల గ్రామీణ బంద్‌కు సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న బాబూరావు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలుకు నిధులు కేటాయిస్తామని వాగ్దానం చేసి, మాట తప్పిన బిజెపిని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ అధ్యక్షతన జిల్లా కమిటీ విస్తృత సమావేశం మంగళవారం జరిగింది. బాబూరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి

2లో



రైతు ఆత్మహత్యల నివారణకు కృషి చేయాలి

3 లో



నివాళులర్పిస్తున్న గుంటూరు కలెక్టర్ తదితరులు

గాంధీజీ సిద్ధాంతాలను అలవర్చుకోవాలి

వార్తలు లోపలి పేజీల్లో

నేటి సాయంత్రానికి ప్రాథమిక నివేదిక

- కోల్డ్ స్టోరేజీ దగ్ధంపై అధికారులకు సబ్‌కలెక్టర్ ఆదేశం
- ఘటనా స్థలిని పరిశీలించిన 11 మందితో కూడిన విచారణ కమిటీ - పలు రికార్డులు స్వాధీనం



ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల కేంద్రమైన దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో అగ్ని ప్రమాదంపై విచారణ కమిటీ బృందం మంగళవారం పరిశీలించింది. ప్రమాదంపై విచారణ కోసం తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్ ఆధ్వర్యంలో వివిధ శాఖలకు చెందిన 11 మంది అధికారులతో కమిటీని ప్రభుత్వం నియమించగా వారు ఘటనాస్థలికి వచ్చారు. కోల్డ్ స్టోరేజ్ కార్యాలయంలోని పత్రాలను పరిశీలించిన అనంతరం ఆయా శాఖలకు సంబంధించి ప్రాథమిక నివేదికలను బుధవారం సాయంత్రానికి

2లో

రైతు ఆత్మహత్యల నివారణకు కృషి చేయాలి

పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రబీలో సాగైన అన్ని పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం చైరమ్న్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ రైతులను సన్నద్ధం చేయాలని, రైతు ఆత్మహత్యలను నివారించేందుకు కృషి చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి మాట్లాడుతూ ఖరీఫ్‌లో శనగ దెబ్బ తిన్న నేపథ్యంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా 80 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేశామని చెప్పారు. సాయి మార్కొండారెడ్డి ఖరీఫ్ సీజన్‌కు కావాల్సిన విత్తనాలు, ఎరువులను అంచనా వేయాలని, రాయితీపై పచ్చిరొట్టె ఎరువులు ముందుగానే అందే విధంగా చూడాలని కోరారు.

కార్పొరేషన్ డిసిపి బదిలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుంటూరు నగరపాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్ జి.కోటయ్య బదిలీ అయ్యారు. ఆయన్ను రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ ఆధారిటీకి బదిలీ చేయగా ఆయన స్థానంలో రాజమహేంద్రవరం ప్లానింగ్ ఆఫీసర్ ఎన్. శ్రీనివాస్‌ని గుంటూరుకు బదిలీ చేశారు. ఈమేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - తాడికొండ : క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, వైసిపి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త ఎం.సుచరిత అన్నారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో విజేతలకు నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలోని జీవీకే పాఠశాలలో మంగళవారం బహుమతులను ప్రదానోత్సవం నిర్వహించారు. సుచరిత మాట్లాడుతూ గతంలో గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది మాత్రమే క్రీడలు ఆడే అవకాశం వుండేదని, అందుకే గ్రామాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. స్నేహపూర్వక ఆటలు అవసరమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బి.బ్రహ్మారెడ్డి, ఎంపిపి టి.భాగ్యలక్ష్మి శివనాగరాజు, వైస్ ఎంపిపి ఆర్.త్రివేణి, సర్పంచి టి.సరోజిని నరసింహారావు, వైసిపి పార్టీ మండల అధ్యక్షులు బి.వెంకటేశ్వరరెడ్డి, యార్డు చైర్మన్ సిహెచ్.పూర్ణచంద్రరావు, మండల స్పెషల్ ఆఫీసర్ డి.సుధాకర్, ఎంపిడిఒ ఎ.దీప్తి, ఎంఈఓ టి.ఇందిరా, పిఇటిలు పాల్గొన్నారు.

అడవి తక్కెళ్లపాడు జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి-గుంటూరు : జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ మంగళవారం అడవితక్కెళ్లపాడు జెడ్పి హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో నాడు-నేడు ఫేజ్-2 పనులు పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రీ ఫైనల్, పబ్లిక్ పరీక్షలకు ప్రతిరోజూ ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలని కోరారు. విద్యాజ్యోతి మెటీరియల్ ఉపయోగించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న స్టడీ క్లాసులకు అందరూ హాజరు కావాలన్నారు. పరీక్షల్లో భయాన్ని, ఒత్తిడిని పోగొట్టి విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. హెచ్‌ఎం కె.జయశ్రీ, ఉపాధ్యాయులు కె.రవికుమార్, సుధారాణి పాల్గొన్నారు.

విభజన హామీలు నెరవేరలేదు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి: రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్రం 2014లో పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలు ఇంకా నెరవేరలేదని ఎంపీ గల్లా జయదేవ్ తెలిపారు. ఢిల్లీలో పార్లమెంటులో జరిగిన 17వ లోక్‌సభ చివరి సమావేశాలు సందర్భంగా జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పునర్వ్యవస్థీకరణ చట్టంలో అమలుకాని హామీలు, ప్రత్యేక హోదా, అమరావతి అభివృద్ధికి తోడ్పాటు, పోలవరానికి నిధులు, కొత్త రైల్వేజోన్ అభివృద్ధికి సంబంధించిన హామీలను గుర్తు చేశారు. పునర్వ్యవస్థీకరణ చట్టం, సెక్షన్ 93 ప్రకారం, 13వ షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా పదేళ్లు ముగుస్తుందన్నారు.

పాలవెల్లువలో ఎక్కువ మందిని నమోదు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు



వైద్యులకు సంతాపం తెలుపుతున్న కలెక్టర్, ఐఎంఎ ప్రతినిధులు

పాడి రైతులకు అధిక ఆదాయం కల్పించేందుకు అమలు చేస్తున్న జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో పాడి రైతులను ఎక్కువ మందిని నమోదు చేసి పాల సేకరణ చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లాలో మూడవ విడతలో జగనన్న పాల వెల్లువ ద్వారా పాల సేకరణ చేసే కార్యక్రమంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో పాల సేకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయినందున ఫిబ్రవరి 1వ తేది నుండి పాల సేకరణను ప్రారంభించాలన్నారు. పాల సేకరణకు ఎంపిక చేసిన పాడి రైతులకు బ్యాంక్ అక్కౌంట్లు వెంటనే తెరిపించాలన్నారు.

కోవిడ్‌లో వైద్యుల సేవలు వెలకట్టలేనివి

కరోన సమయంలో వైద్యం అందిస్తూ ప్రాణాలను కోల్పోయిన డాక్టర్ల సేవలను వెలకట్టలేమని జిల్లా కలెక్టర్ అన్నారు.కరోనా సమయంలో ప్రాణాలను కోల్పోయిన వైద్యులకు నివాళి అర్పించే కార్యక్రమం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు బ్రాంచి ఆధ్వర్యంలో నిర్వహించారు.

గాంధీజి ఆశయాలను సాధిస్తాం : డొక్కా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



ర్యాలీలో పాల్గొన్న మాణిక్య వర ప్రసాద్

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా అమరావతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో మహాత్మా మళ్లీ రావాలంటూ మంగళవారం గుంటూరులో ర్యాలీ జరిగింది. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్ ర్యాలీని ప్రారంభించారు. శంకర్‌విలాస్ నుంచి జిన్నాటవర్ వరకు ర్యాలీ జరిగింది. స్థానిక హిమనీ సెంటర్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గాంధీ ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. అవినీతి, అంటరానితనం, హింస లేని సమాజం అవసరం అని మాణిక్య వర ప్రసాద్ అన్నారు. గాంధీ మళ్లీ పుట్టాలని ఆయన ఉద్ఘాటించారు.

బృందావన్ గార్డెన్స్‌లోని ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి క్యాంపు కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. టీఎల్వీ వీరాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, గీతా మందిరం ఛైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకష్ణ (ఆచారి), షేక్ రోషన్, ఆర్యవైశ్య నేతలు దేవరశెట్టి చిన్ని, పబ్బిశెట్టి చిరంజీవి, అన్నదాన సత్రం ఛైర్మన్ పోకల వసంత్ తదితరులు బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఎన్నికల్లో బిజెపిని ఓడించాలి : సిపిఎం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. నిరుద్యోగం పెరుగుతోందని, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా వున్న ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఆయోధ్యలో రామ మందిర నిర్మాణం పేరుతో మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని, రాజ్యాంగంలోని లౌకిక విలువలకు తిలోదకాలిస్తోందని మండిపడ్డారు. ఈ స్థితిలో భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి అందరూ కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపి, జనసేన బిజెపి విధానాలను వ్యతిరేకించకుండా అంటకాగుతున్నాయన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగిస్తోందన్నారు. అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష కార్మికులకు వారి ఆందోళన సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రభుత్వ భూముల్లో ఇళ్లేసుకుని నివాసముంటున్న పేదలకు ఇళ్ళ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. వచ్చేనెల 16న కార్మిక, రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సమావేశంలో తీర్మానించారు. పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని సమావేశం డిమాండ్ చేసింది. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు వై.నేతాజి, కె.నళినీకాంత్, ఇ.అప్పారావు, ఎస్ఎస్.చెంగయ్య, ఎం.రవి, ఎమ్.ఎ.చిష్టీ, బి.వెంకటేశ్వరరావు, డి.వెంకటరెడ్డి, బి.కొటేశ్వరి, ఎల్.అరుణ పాల్గొన్నారు.

సెంటు భూముల రిజిస్ట్రేషన్‌పై రైతుల ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

చేసిందని, పంచాయతీ కార్యదర్శులకు రిజిస్ట్రేషన్ బాధ్యతను అప్పజెప్పిందని రైతులు మండిపడుతున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ మంగళవారం తుళ్లూరులో పంచాయతీ కార్యదర్శికి రైతులు, మహిళలు వినతిపత్రం అందజేశారు.

రాజధాని అమరావతిలో గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన 51,392 మందికి సెంటు స్థలాల పంపిణీకి ప్రభుత్వం సిద్ధపడింది. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి 1402.58 ఎకరాల్లో లే ఔట్‌లలో జంగిల్ క్లియరెన్స్‌తో పాటు రోడ్లు చదును చేయడం, మెరకలు తోలడం లాంటి పనులను సిఆర్‌డిఎ అధికారులు చేపట్టారు. రాజధానిలోని నిడమర్రు, కృష్ణాయపాలెం, నవులూరు, ఐనవోలు, మందడం, కురగల్లు, ఎర్రబాలెం, పిచ్చుకలపాలెం, బోరుపాలెం, నెక్కల్లు, అనంతవరంలో 25 లే అవుట్‌లలో మౌలిక సదుపాయాలను చేపట్టారు. రైతుల అభ్యంతరాలను, నిరసనలను పట్టించుకోకుండా కృష్ణాయపాలెం లే అవుట్‌లో షేర్ వాల్ పద్ధతిలో నమూనాగా సెంటు స్థలంలో నిర్మించిన ఇంటిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గతేడాది జులై 24న ప్రారంభించారు. అయితే ఆగస్టు 2 న హైకోర్టు సెంటు స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను చేపట్టవద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రభుత్వం ఈ వ్యవహారంలో అడుగు ముందుకు వేయలేక పోయింది. ఇళ్ల నిర్మాణాలు కూడా నిలిచిపోయాయి. కొంతకాలం మౌనంగా ఉన్న ప్రభుత్వం చివరకు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ తాజాగా సెంటు స్థలాల రిజిస్ట్రేషన్‌కు సిద్ధం కావడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

కౌలు కోసం 8 నెలలుగా

(మొదటి పేజీ తరువాయి)

ఈ విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తున్నా చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తోంది. 2021 నుంచి ప్రతి ఏటా కోర్టులో పిటీషన్ దాఖలు చేసిన తరువాతనే రైతులకు కౌలుసాయం అందిస్తున్నారు. రెండేళ్లుగా అసైన్డ్ రైతులకు కూడా కౌలు పరిహారం నిలిచిపోయింది. 29 గ్రామాల్లో 3వేల మంది అసైన్డ్ రైతులు ఉన్నారు. వీరి భూములు కూడా రాజధానికి తీసుకున్నారు. అయితే అసైన్డ్ భూముల అప్పగింతలో అక్రమాలు జరిగాయని సిఐడి అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ దర్యాప్తు పెండింగ్‌లో ఉండటం వల్ల 3 వేల మంది అసైన్డ్ రైతులకు కౌలు పరిహారం నిలిపివేశారు. భూములన్నీ రాజధాని నిర్మాణం నిమిత్తం సిఆర్‌డిఎకు ఇచ్చామని, తమకు కౌలు ఆదాయం తప్ప మరో ఆధారం లేకపోవడం వల్ల ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని రైతులు హైకోర్టులో దాఖలు చేసిన పిటీషన్‌లో పేర్కొన్నారు. పలుమార్లు విచారించిన హైకోర్టు కౌలు వెంటనే చెల్లించాలని ఇచ్చిన ఉత్తర్వులు ఇంతవరకు అమలుకు నోచలేదు.

నేటి సాయంత్రానికి ప్రాథమిక నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. కమిటీలోని 11 మంది అధికారులతో ఒక వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందులో పొందుపర్చానలి చెప్పారు. స్టాకు వివరాలు, బీమా, బ్యాంకింగ్, ప్రమాద వివరాలు, లైసెన్సు, అగ్రిమెంట్, కండిషన్ సమస్యలు తదితర అంశాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని అన్నారు.

అనంతరం రైతుల కోరిక మేరకు స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో రైతులు, రైతు సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. సమస్యను అడిగి తెలుసుకుని అర్జీల రూపంలోనూ తీసుకున్నారు. రైతులు ప్రస్తావించిన అంశాలు, సమస్యలనూ నివేదికలో పొందుపరుస్తామని సబ్‌కలెక్టర్ చెప్పారు. విచారణ కమిటీలో గుంటూరు నార్త్ జోన్ డీఎస్పీ జె.రాంబాబు, అగ్నిమాపక దళ జిల్లా అధికారి ఎం.శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు, వాణిజ్య పంటల జిల్లా అధికారి బి.రవీంద్రబాబు, మార్కెటింగ్ శాఖాధికారి బి.రాజబాబు, పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజర్ ఎం.మదన్మోహన్‌శెట్టి, పరిశ్రమల శాఖ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎ.గాయత్రిదేవి, లీడ్ బ్యార్ డిప్యూటీ మేనేజర్ ఎ.మహిపాల్‌రెడ్డి, నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ శరత్ ఉన్నారు.

పలు పత్రాలు స్వాధీనం

ఇదిలా ఉండగా కోల్డ్ స్టోరేజ్‌కి సంబంధించిన కొన్ని రికార్డులను స్టోరేజీ కార్యాలయంలో తహశీల్దార్ కె.మల్లీశ్వరి, వ్యవసాయ మార్కెటింగ్ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ ఎన్.శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. వాటిని తమ సిబ్బంది ద్వారా స్థానిక ట్రెజరీ కార్యాలయానికి తరలించి ఎస్‌టిఒ షేక్ మస్తాన్ గుంషా వలి సమక్షంలో సీల్ వేసి భద్రపరిచారు.

కొత్త పనులకు నిధుల్లేవు..!

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ మండంలో ఏడాది క్రితం చేసిన పనులకు ఇంత వరకూ బిల్లులు చెల్లించలేదని, ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని కోరారు. దీనిపై ఛైర్‌పర్సన్ స్పందిస్తూ ఆర్థిక సంఘం నిధులు వచ్చాక విడుదల చేస్తామని చెప్పారు. ఫిరంగిపురం జెడ్పీటీసీ మాట్లాడుతూ గుండాలపాడులో ఎవరైనా చనిపోతే శ్మశాన వాటికకు మృతదేహాన్ని తీసుకెళ్లటానికి కాల్వ దాటి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ సమస్యను నాలుగు సమావేశాల నుండి అడుగుతున్నామన్నారు. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ నిధులు సమస్య ఉందని, పంచాయతీరాజ్ ద్వారా సాధ్యమవుతుందేమోనని పరిశీలించాలని పంచాయతీరాజ్ ఎస్ఇని కోరారు.

పలువురు జెడ్పీటీసీలు కొత్త పనులు మంజూరు చేయాలని కోరగా ఈ ఏడాది ఇప్పటికే బడ్జెట్‌కు మించి పనులు ఇచ్చామని, కొత్త పనులు ఇవ్వటానికి నిధులు లేవని అన్నారు. అంతే కాకుండా 15వ ఆర్థిక సంఘం నిధులు రావాల్సి ఉందని, కొత్త పనులు వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపడతామని చెప్పారు. ఇటీవల జెడ్పీ నిధులతో పదో తరగతి విద్యార్థులకు అందచేసిన స్టడీ మెటీరియల్‌పై విద్యార్థుల స్పందనను జెడ్పీ ఛైర్‌పర్సన్ డిఇఒలను అడిగి తెలుసుకున్నారు. డిఇఒలు విద్యార్థులకు ఉపయోగంగా ఉందని చెప్పారు. గత జెడ్పీ జనరల్ బాడీ సమావేశంలో నిర్ణయించిన విధంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు నెల ముందు అల్పాహారం అందచేస్తామని ఆమె ప్రకటించారు. 7వ స్థాయి సంఘంలో సభ్యురాలైన దాచేపల్లి జెడ్పీటీసీ ఎం.కృష్ణకుమారి స్థానంలో ఆమె భర్త ప్రకాష్‌రెడ్డి సమావేశానికి హాజరవడం చర్చనీయాంశమైంది. 4వ కమిటీ కోరం లేక వాయిదా పడింది. వ్యసాయంపై స్థాయి సంఘ సమావేశం జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి, తెనాలి జెడ్పీటీసీ పి.ఉమాప్రణతి అధ్యక్షతన, స్త్రీ శిశు సంక్షేమంపై వైస్ ఛైర్‌పర్సన్ బి.అనురాధ అధ్యక్షతన సాంఘిక సంక్షేమం స్థాయి సంఘ సమావేశాలు జరిగాయి.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - వినుకొండ

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండ పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో వినుకొండ నియోజకవర్గ పరిధిలోని 7మంది బాధితులకు వచ్చిన 10 లక్షల 15 వేల రూపాయల సీఎం ఆర్థిక సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని పేదలను ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకోవడం జరిగింది అన్నారు. ఆరోగ్య శ్రీ అనుమతులు ఉన్న వైద్యశాలలోనే చికిత్స చేయించుకోవాలని అన్నారు. చాలా రకాల వ్యాధులను ఆరోగ్య శ్రీ పథకంలో చేర్చారని చెప్పారు. అన్ని వైద్య సౌకర్యాలు, ఆయా విభాగాల్లో నిపుణులు ఉన్నటు ఆసుపత్రులకు మాత్రమే ఆరోగ్యశ్రీ అనుమతులు ప్రభుత్వం కల్పించిందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని అన్నారు. ఆరోగ్యశ్రీ ఉండి కూడా ఆసుపత్రి యాజమాన్యం వారు నగదును డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకొని రావాలని కోరారు.



కళ్లం విద్యార్థులతో డైరెక్టర్, ప్రిన్సిపాల్ తదితరులు

'కళ్లం' విద్యార్థుల అవగాహన సదస్సులు

ప్రజాశక్తి-గుంటూరు

కళ్లం హరనాధరెడ్డి ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థులు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యను అభ్యశిస్తున్న 5-10 తరగతి విద్యార్థులకు సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్, డిజిటల్ టెక్నాలజీ ఉపయోగాలపై అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా చిలకలూరిపేటలోని సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ గేమ్స్ వల్ల జరిగే ప్రమాదాలను విద్యార్థులకు తెలియజేశారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	1,30,851
మిర్చి ఎగుమతి	:	1,25,366
మిర్చి నిల్వ	:	72,581

మిర్చి ధరలు

రూపాయలలో

334	9,500 - 20,000
నెం.5	12,000 - 20,000
273	12,500 - 15,500
341	9,500 - 19,500
4884	13,500 - 17,500
సూపర్ 10	14,000 -14,000
నాన్ ఎసి	
తేజ	8,000 - 20,500
బడిగి	9,500 -19,700
దేవనూరు డీలక్స్	11,000 - 19,000
తాలుకాయలు	5,000 - 13,000

సంక్షేమపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడమే లక్ష్యంగా పనిచేయాలని తూర్పు ఎమ్మెల్యే ముస్తాఫా కోరారు. మంగళవారం వైసిపి తూర్పు నియోజకవర్గం కార్యాలయంలో జరిగిన సచివాలయస్థాయి కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్తాఫా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయంకోసం కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. పార్టీ కుటుంబ సభ్యుల కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. తూర్పు సమన్వయకర్త నూరిఫాతిమా మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీకి పునాది రాయి లాంటి వారని అటువంటి కార్యకర్తలకు తమ పార్టీలో అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని ఆమె అన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. ఫిబ్రవరి1వ తేది నుంచి ఎన్నికల శంఖారావం వాసవీ నగర్ నుంచి మొదలవుతుందని ఆమె తెలిపారు. మైనార్టీలకు తగిన గుర్తింపు వచ్చిందంటే వైఎస్సార్ ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లు కారణం అన్నారు. డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు, కార్పొరేటర్లు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తాఫా

జిజిహెచ్‌లో అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది పనితీరును మెరుగుపర్చేందుకు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ రాత్రి వేళ ఆకస్మిక తనిఖీలుచేస్తున్నారు. సోమవారం రాత్రి 10 గంటలనుంచి అర్ధరాత్రి వరకు పలు వార్డులను తనిఖీ కొనసాగించారు. ఆసుపత్రి లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండటంపై ఆయన అసంతప్తి వ్యక్తం చేసారు. బాధ్యతాయుతంగా పని చేయాల్సిన బాధ్య త అందరి పై ఉందని పలువురికి ఆయన సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి చురకలు వేస్తూ బాధ్యత గా మెలగాలని ఆయన చెప్పారు. 106 వార్డు గర్భిణిల వార్డు ను పరిశీలించిన సమయంలో మగవారు ఉండటం పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. మహిళలు ఉన్న వార్డు లో మగవారిని ఎందుకు లోపలకు పంపించారంటూ ఆయన సెక్యూరిటీ సిబ్బంది పై మండిపడ్డారు. ఈ విషయంలో నర్సింగ్ సిబ్బంది కూడా బాధ్యత తీసుకోవాలని ఆయన చెప్పారు. అనంతరం కాన్పుల వార్డులో లైంగిక వేధింపులకు గురైన మూడేళ్ళ చిన్నారిని పరామర్శించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి పై అక్కడ వైద్యులు, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారికి ఆరోగ్యపం ˊమైన సమస్యలు వచ్చిన వెంటనే స్పందించి వైద్య సేవలు అందించాలని ఆయన చెప్పారు. చిన్నారి తల్లితండ్రులను ఆయన ఓదార్చారు. ఈ వార్డు లో పడకల పై బేడీషీట్స్ లేకపోవడం పై ఆయన అసహనం వ్యక్తం చేసారు. కనీసం పడకలపై బేడీషీట్ ఉన్నాయా లేవా అని గుర్తించే స్థితిలో లేకపోవడం పై అసంతప్తి వ్యక్తం చేసారు. పడకలపై బేడీషీట్స్ అమర్చాల్సి బాధ్యత ఎవరిపై ఉందంటూ అక్కడ సిబ్బంది ని ప్రశ్నించారు. విధుల్లో ఒకరినొకరు తప్పించుకుని పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అయన అన్నారు. ఇప్పటికైనా మన బాధ్యతలను గుర్తు చేసుకుని పని చేయాలనీ అయన సూచించారు.

అనంతరం స్వయంగా ఆయనే 20 బేడీషీట్లను తెప్పించి బెడ్స్ పై అమర్చి సరి చేశారు. అనంతరం డి ఏ పి వార్డులను అయన పరిశీలించారు. అత్యవసర చికిత్స విభాగం లో విపరీతంగా రోగులు రావడం తో రద్దీ గా ఉండటాన్ని ఆయన గమనించారు. రోగుల వారందరిని వెంటనే పలు విభాగాలకు రోగులను పంపించి డి ఏ పి ని ఖాళీ చేయించారు, ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజూ రోగులు వారి సహాయకులు వెయ్యి మంది వరకు అత్యవసర చికిత్స విభాగానికి రావడం వల్ల రద్దీ విపరీతంగా పెరిగిందని వారి అవసరాలకు తగ్గట్టుగా ఎక్కడ పడకలు ఖాళీగా ఉన్నాయో అక్కడ వారిని పంపిస్తున్నట్లు ఆయన చెప్పారు.

నేడు టిజెపిఎస్‌లో ఎన్ఎస్ఎస్ వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు: స్థానిక టిజెపిఎస్ కాలేజిలో నేడు జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారులు-సామాజిక బాధ్యతలు' అనే అంశంపై ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బి.పి మనోహర్ తెలిపారు. ఇతర వివరాలకు 9849854221 నెంబర్‌ని సంప్రదించాలని కోరారు.

సీజ్ చేసిన వాహనాలకు 3న వేలం

ప్రజాశక్తి-నకరికల్లు: మద్యం కేసులలో సీజ్ చేసిన వాహనాలను ఫిబ్రవరి 3 న వేలంపాట నిర్వహించడం జరుగుతుందని ఎస్ఐ పైడి రాంబాబు మంగళవారం తెలిపారు. వేలం పాటలో రూ.1,18,500 విలువ గల ఆరు ద్విచక్ర వాహ నాలు, ఒక కారు ఉన్నట్లు చెప్పారు. వేలం పాట పాల్గొనే ప్రతి ఒక్కరూ రూ.2000 డిపాజిట్ చేయాలన్నారు.

సద్భావనకు ప్రతీకగా అంబేద్కర్ యాత్ర

సందర్శనకు వాహనాల ఏర్పాటు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

విజయవాడలోఇటీవల ఆవిష్కరించిన అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించేందుకు గుంటూరు నుంచిపలు వాహనాలలో ప్రజలను తొడ్కొని వెళ్లారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ప్రతి ఒక్కరూ సందర్శించాలని డిసిసిబి చైర్మన్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) సూచించారు. వైసిపి కాంగ్రెస్ పార్టీ గుంటూరు క్లస్టర్ - 2 అధ్యక్షుడు నూనె ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక చుట్టుగుంట నుంచి "సమసమాజ సద్భావనకు ప్రతీకగా.. సామాజిక సాధికారత చిహ్నంగా.. ముఖ్యమంత్రి వైయస్ జగన్ విజయవాడలో ఆవిష్కరించిన 125 అడుగుల సామాజిక న్యాయ మహాశిల్పం సందర్శన యాత్ర" ప్రారంభమైంది. రాముతో పాటు వైసిపి నాయకులు విడదల గోపి 5 బస్సులకు జెండా ఊపి లాంఛనంగా యాత్రకు శ్రీకారం చుట్టారు. రాము మట్లాడుతూ 125 అడుగుల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం చరిత్రలో ఎప్పటికీ గొప్పగా నిలిచిపోతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కాండ్రకుంట గురవయ్య, అచ్చాల వెంకటరెడ్డి, అందుగుల సంతోష్, పడాల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యాత్ర ప్రారంభిస్తున్న లాల్‌పురం రాము



ప్రజల చెంతకు ఆరోగ్య సేవలు

ప్రజాశక్తి-అమరావతి

పేదల ఆరోగ్యం పట్ల అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షులు, అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. మంగళవారం ధరణికోట-1 సచివాలయంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ -2 కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు, పేదవాడి చెంతకు ఆరోగ్య సేవలను తీసుకొచ్చిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డి అని, రాష్ట్రంలోని ప్రతి ఒక్క పౌరుడి ఆరోగ్యం గురించి వైద్యాధికారులు అవగాహన కలిగి ఉండేలా ఈ కార్యక్రమం రూపొందించడం జరిగిందని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో వైద్య రంగానికి అత్యధిక ప్రాముఖ్యత ఇవ్వటం జరిగిందన్నారు. అమరావతి మండలంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మరియు అత్త లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నకు కొత్త బిల్డింగులు నిర్మించినట్లు చెప్పారు.



4న 'చలో విజయవాడ'

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణ గ్రామీణ ఆర్ఎంపి,పిఎంపి వైద్యుల ఐక్యవేదిక స్థానిక ఎన్ఎస్పి కార్యాలయంలోని యూనియన్ కార్యాలయం లో 'చలో విజయవాడ' పోస్టర్ ను విడుదల చేశారు. రాష్ట్రం లోని ఆర్ఎంపి, పిఎంపిల మహాసభ ఫిబ్రవరి 4వ తేదీన విజయవాడలో జరగనుంది. ఈ నేపథ్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వినుకొండ యూనియన్ అధ్యక్షుడు పాశం నాగమల్లేశ్వర రావు, గౌరవాధ్యక్షుడు కె. బ్రహ్మానందఎం. బ్రహ్మయ్య, షేక్ హుసేన్, రామ లింగాచారి, నాయకులు సత్తార్ ,వలి, శేషశాయి, మురళీ కృష్ణ, నరసింహారావు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి ప్రతిభా పోటీలు

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'రాంసా అసోసియేషన్' ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయి ప్రతిభా పోటీలు జరుగుతాయని కన్వీనర్ బి.వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాస రెడ్డి తెలిపారు.వ్యాస రచన, డిబేట్,డ్రాయింగ్,క్విజ్ విభాగాల్లో జిల్లా స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు..వివరాలకు 9963223714 నంబర్‌లో సంప్రదించాలన్నారు. విజేతలకు క్యాష్ ప్రైజ్, మెమెంటోలను అందజేయనున్నట్లు చెప్పారు.. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు భోజన వసతి కల్పిస్తారని తెలిపారు.



పమీల రాణిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం


స్నేహ పూర్వక సంబంధాల మెరుగుకు ఫ్రెషర్స్ డే

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రమీలరాణి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థుల మధ్య స్నేహపూర్వక సంబంధాలు మెరుగుపడేందుకు ఫ్రెషర్స్ డే వేడుకలు దోహదం చేస్తాయని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రమీల రాణి అన్నారు. నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ గ్రామ పరిధిలో గల సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ప్రమీల రాణి మాట్లాడుతూ యువత చైతన్యంతో ర్యాగింగ్ పెనుభూతాన్ని తరిమి కొట్టాలని జూనియర్ సీనియర్స్ అనే భేదాలు లేకుండా కళాశాల జీవితం ఆద్యంతం స్నేహపూర్వక వాతావరణంలో పూర్తయ్యేలా వ్యవహరించాలన్నారు. కళాశాల యాజమాన్యం కూడా తరచూ ర్యాగింగ్ పై అవగాహన కల్పించే విధంగా సదస్సులు నిర్వహించాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ చెన్నుపాటి పవన్ మాట్లాడుతూ ఫార్మసీ రగంలో యువతకు మెరుగైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. తమ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో అత్యాధునిక బోధనా ప్రమాణాలతో బోధన చేస్తున్నామన్నారు. గౌరవ అతిథులుగా వల్లభ గ్రూప్స్ మేనేజర్ బొల్లా శ్రీనివాస్, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఖలీల్, డాక్టర్ ఆశా, సీనియర్ న్యాయవాది ఆరోగ్యం చౌదరి లను ఘనంగా సత్కరించారు.ఫ్రెషర్స్ డే వేడుకల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి

డబల్ ఎంట్రీల్లో మార్పేది?



- **చనిపోయిన వారి ఓట్లు తొలగించట్లేదు**
- **బూత్ స్థాయి కన్వీనర్లు, ఓటర్ల విమర్శలు**

ప్రజాశక్తి - చిలకలూరిపేట

బూత్ స్థాయి కన్వీనర్ (పార్టీలకు ఒకరు చొప్పున వ్యక్తులు) కి బూత్ స్థాయి (ప్రభుత్వం తరపున అధికారులు) అధికారులు కలిసి సుమారు 120 నుంచి 150 రోజుల పాటు పలుమార్లు ఇం టింటికీ తిరిగి తొలగించాల్సిన ఓట్లపై విచారణ చేశారు. అయితే, రెండు సార్లు (డబల్ ఎంట్రీ) వచ్చిన ఓట్లు, చనిపోయిన వారివి,శాశ్వతంగా చిరునామాలు మారిన వారి ఓట్లను కూడా అదే చిరునామాలో ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. ఓటర్ కార్డుకు ఆధార్ లింక్ చేసే ప్రయత్నాలు చేయడం లేదని బూత్ స్థాయి కన్వీనర్లు చెబుతున్నారు.ప్రతిసారి విచారణ చేయడం లేని ఓట్లకు డిలీట్ ముద్ర వేసి ఇస్తున్నారు. ముఖ్యంగా కొన్నేళ్ల క్రితం చనిపోయిన వారిలో కొంతమంది ఓట్లు తొలగించడం లేదని బూత్ స్థాయి కన్వీనర్లు చెబుతున్నారు. ఇప్పటికే మూడు సార్లు ఓటర్ల జాబితా మార్చారని, ఇంకా తుది జాబితా రాలేదని చెబుతున్నారని, నాల్గో జాబితా ఇస్తామంటున్నారని చెబుతున్నారు. తుదిజాబితా ఎప్పటికి వస్తుందని ఆయా వార్డుల్లోని ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. 198 బూత్‌లో వరుస నంబర్ 367లో ఉన్న వ్యక్తి చనిపోయారు. ఈ విషయమై చేసిన విచారణలో వారి కుటుంబసభ్యులందరూ అంగీకరించారు. అయితే అదే బూత్‌లో వరుస నంబర్ 370 లో ఉన్న వ్యక్తి చనిపోయినప్పటికి ఆ ఓటును తొలగించలేదు.

చిరునామాలుమారిన వారివి, శాశ్వత అడ్రస్సు మారిన వారివి, ఆయా వార్డుల్లో నివసించనవారి ఓట్లు గతంలో ఉన్న చోటే ఉండటం, చనిపోయిన వ్యక్తుల ఓట్లు తొలగించకపోవడం, డబుల్ ఎంట్రీలు ఉండటం వంటి వాటికి సంబంధించి ఈ బూత్‌లో 50 మంది వరకు ఉన్నాయి. అదే, చిలకలూరిపేట లో అయితే ఈ తరహా ఓట్ల సంఖ్య మూడు వేలకు పైగానే ఉంటుందని తెలుస్తోంది. ఇప్పటికైనా నాల్గో ఓటర్ల జాబితాలోగా ఆధార్ కార్డులు లింకు చెసి సక్రమ మైన జాబితా విడుదల చేయాలని బూత్ కన్వీనర్లు కోరుతున్నారు.



డ్వాక్రా సంఘాల మహిళలకు చెక్కు అందచేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లిలో రూ.5.68 'ఆసరా' చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతలలో డ్వాక్రా రుణ మాఫీ చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, తన మాట నిలబెట్టుకున్నారని జల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో మంగళవారం జరిగిన పొదుపు సంఘాల ఆసరా వారోత్సవాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసం గించారు. ముందుగా ముఖ్యమంత్రి జగ న్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు గత ఎన్నికల సమ యంలో రైతు, డ్వాక్రా రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చి హామీని చెత్తలో పడేసి దుర్మా ర్గపు పాలన చేశారని విమర్శించారు. ఒక్క జగన్మోహన్‌రెడ్డి మాత్రం ఇచ్చిన మాట మేరకు రూ.2,570 కోట్లను డ్వాక్రా రుణ మాఫీ చేశారన్నారు. అనం తరం పట్టణంలోని 702 సంఘాలలో 6,936 మంది సభ్యులకు గాను రూ.5.68 కోట్లు, రూరల్ మండల పరిధిలోని 1318 సంఘాలకు చెందిన 12,859 మంది సభ్యులకు గాను రూ.10.91 కోట్ల ఆసరా నమూనా చెక్కులను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుంటూరు ఏఎంసి చైర్మన్ నిమ్మకాయల రాజ నారాయణ ఉన్నారు

విదేశీ విద్యపై అవగాహన

ప్రజాశక్తి - నరసరావుపేట.

స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మంగళవారం విదేశీ విద్య పై అవగాహనా సదస్సు ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐర్లాండ్ కు చెందిన ప్రతినిధి డేవిడ్ ఫాలోన్ ముఖ్య అతిది గా హాజరయ్యారు.ఆయన మాట్లాడుతూ విదేశీ విద్య ఎలా పొందాలి, స్కాలర్ షిప్ ఎలా పొందాలి లాంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కళాశాల ప్రిన్సిపాల్ నాతని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్య మరియు ఉద్యోగ అవకాశాలు ఎలా పొందలో విద్యార్థులకి వివరించారు. కార్యక్రమం లో ఎల్. ఆంజనేయులు, ఎం.అప్పారావు, ఎం. బాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐర్లాండ్ కు చెందిన డేవిడ్ ఫాలోన్

ప్రాంగణ ఎంపికల్లో 'తిరుమల' విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కళాశాలలో ఉన్నత బోధన ప్రమాణాలు పాటించడం కల్పిస్తున్న మౌళిక సదుపాయాల కల్పన నేపథ్యంలో తమ విద్యార్థులు కళాశాలలో బహుళజాతి కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఉద్యోగాలు సాధిస్తున్నారని తిరుమల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ అన్నారు. స్థానిక జొన్నలగడ్డ గ్రామ పరిధిలో గల తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

బహుళజాతి కంపెనీ కోడ్నెస్ట్ కంపెనీ ఈనెల 27న నిర్వహించిన ప్రాంగణ ఎంపికలు 23 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీకి చెందిన వివిధ విభాగాల నుండి మొత్తం 240 మంది విద్యార్థులు ప్రాంగణ ఎంపికలలో పాల్గొనగా కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు నిర్వహించిన రాత పరీక్ష, కమ్యూనికేషన్ రౌండ్, టి ఆర్ మరియు హెచ్ఆర్ విభాగాలలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో 23 మంది విద్యార్థులు ప్రతిభ చాటి ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు వార్షిక వేతనం రూ 3 నుండి రూ 6 లక్షల వరకు వేతనాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో అభినందించారు. తమ కళాశాల విద్యార్థులు అత్యధిక వేతనంతో బహుళ జాతి కంపెనీలలో కొలువులు సాధించడం పట్ల తమ కళాశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్య వలన సాధ్యమవుతుందన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, కళాశాల చైర్మన్ వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, వైస్ చైర్మన్ బత్తిన నాగేశ్వరరావు, కోశాధికారి దండా బ్రహ్మానందం తదితరులు అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎం సాంబశివరావు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణవేణి జూనియర్ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక కృష్ణవేణి జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు మంగళవారం నరిశెట్టి కళ్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. వార్షికోత్సవ సభకు ప్రిన్సిపాల్ వై వెంకట్రామయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశాలు ముఖ్య అతిథిగా విచ్చేసిన పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి చదువు ప్రాధాన్యతను వివరించారు. ఇంగ్లీష్ మీడియం ఔన్నత్యాన్ని వివరించారు. ఈ సమావేశంలో గుంటూరు డైట్ కాలేజ్ సైకాలజీ ప్రొఫెసర్ సుగంధ రావు మాటాడుతూ ఉన్నత శిఖరాలు అధి రోహించటానికి కార్పొరేట్ కళాశాలలోని చదవాల్సిన అవసరం లేదని, మాచర్ల లాంటి పట్టణంలో చదివే విద్యార్థులు, విద్యార్థినులు సాధించవచ్చని వివ రించారు.ఉన్నత శిఖరాలు చేరు కోవడానికి పేదరికం అవరోధము కాదని వివరించారు.

కళాశాల డైరెక్టర్ పాతూరి శ్రీనివాస రావు , గుమ్మడి సుబ్బారావు, కృష్ణవేణి జూనియర్ కళాశాల సత్తెనపల్లి డైరెక్టర్ వి శ్రీనివాసరావు ప్రసంగించారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. తరువాత విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది.



గాంధీజీ సిద్ధాంతాలను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం కలక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌ఛార్జి డిఆర్‌ఓ లక్ష్మీకుమారి, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, చేనేత, జౌళి శాఖ ఎడి వి.వనజ, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఎఎన్‌యు

మహాత్మా గాంధీ సిద్ధాంతాలను యువత అలవర్చుకోవాలని రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాద్ మూర్తి సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ గాంధీయన్ స్టడీస్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమానికి గాంధీయన్ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.సోమశేఖర్ అధ్యక్షత వహించారు. తొలుత గాంధీ విగ్రహానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. రెక్టార్ మాట్లాడుతూ గాంధీ జీవితమే ఒక సందేశమన్నారు. సోమశేఖర్ మాట్లాడుతూ గాంధీ సిద్ధాంతాలను విస్తృతం చేసేందుకు వర్సిటీలో పరిశోధనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గాంధీకి సంబంధించిన అన్ని విషయాలను గాంధీ అధ్యయన కేంద్రం నుంచి తెలుసుకో వచ్చన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, సైన్స్, ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపల్స్ ప్రొఫెసర్ కె.గంగాధర్ రావు, ప్రొఫెసర్ సిహెచ్.స్వరూపరాణి పాల్గొన్నారు.

వర్ధంతి సందర్భంగా పలుచోట్ల నివాళులు

ప్రజాశక్తి - తెనాలి

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక బోస్ రోడ్డులోని గాంధీ చౌక్ లో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. వైసిపి పట్టణ అధ్యక్షులు ఎం.శేషాచలం మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ పాత్ర ఎంతో గొప్పదని, ఆయన త్యాగనిరతి ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో షేక్ మీరావలి, జి.రాము, బి.లక్ష్మీనారాయణ, కె.గురునాధ గుప్తా, సిహెచ్.సాయి, ఎ.పూర్ణచంద్రరావు, పి.శ్యామలరావు, ఎస్.ఆంజనేయులు, టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

సత్యం, అహింసను ఆయుధాలుగా చేసుకొని స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన మహనీయుడు మహాత్మాగాంధీజీ మార్గం ఆదర్శనీయమని టిడిపి నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ శ్రేష్టి అన్నారు. టిడిపి కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, నాయకులు టి.జానకి దేవి, డి.రాజు, టి.పార్థసారథి, జి.దుర్గారావు, రియాజ్, వెంకటరావు, ఎస్.బాలాజీ గుప్తా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ సలీం, పట్టణ అధ్యక్షులు కె.జీవన సాగర్, నాయకులు కె.కృష్ణారావు, ఆర్.హనుమంతరావు, కె.రాధిక, కె.రత్తయ్య, సిహెచ్ కార్తీక్ పాల్గొన్నారు.

వర్సిటీలో


తెనాలిలో


మంగళగిరిలో




మొక్కజొన్నలో 15-20 శాతం మొక్కలు చనిపోయే అవకాశం

ప్రజాశక్తి-కొల్లిపర

మాగాణి భూములలో రెండో పంటగా వేసిన మొక్కజొన్న పంటలో మొవ్వ తొలుచు పురుగు, కాండము తొలుచు పురుగు ఆశిస్తుందని లాంఫారం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ జివిఎన్ ప్రసాదు అన్నారు. మండలంలోని అత్తోట, దావులూరు, తూములూరు గ్రామాల్లో మొక్కజొన్న పంటను ఆయన వ్యవసాయాధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. మొక్కజొన్న పంటను గులాబీ రంగు మొవ్వ తొలుచు పురుగు ఆశించి పంట నష్టం కలిగిస్తుందని, ఈ పురుగులు ఆకు లోపల 80 నుండి 100 గుడ్లను వరుసలో ముత్యాల లాగా పెడతాయని తెలిపారు. గుడ్ల నుండి నాలుగైదు రోజుల్లో తొలి దశ లార్వాలుగా వెలువడి మొవ్వ లోపలకు వెళ్లి విప్పారని ఆకులను తింటాయని, దీనివల్ల మొవ్వలు చనిపోతాయని వివరించారు. ఈ విధంగా జరిగితే 20-25 రోజులకు 15-20 శాతం మొక్కలు చనిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. విత్తిన 10 లేదా 12 రోజులకు తప్పనిసరిగా ఎకరాకు 500 మిల్లీలీటర్ల క్లోరి ఫైరిఫాస్‌ను పిచికారి చేయాలని, మందులు వేయక మొవ్వలు చనిపోయినట్లు గమనిస్తే వెంటనే ఎకరాకు ఎకరాకు 60 మిల్లీలీటర్ల ట్రైసర్ లేదా 100 మిల్లీ లీటర్ల డెలికేట్ లేదా ఎకరాకు రెండు కిలోల కార్బఫ్రాన్ త్రీజీ గుళికలను మొవ్వలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో డిడిఎ-డిఆర్‌సి రామాంజనేయులు, తెనాలి వ్యవసాయ సంచాలకులు ఉషారాణి, మండల వ్యవసాయ అధికారి వెంకట్రావు పాల్గొన్నారు.

పేదలకు వైసిపి ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టారని, వాటిని ప్రజలు సద్వినియోగపరుచుకోని జగనన్నకు అండగా నిలవాలని పెదనందిపాడు ఎంపిపి టి.హెప్సిబా, వైసిపి మండల కన్వీనర్, ప్రత్తిపాడు యార్డు డైరెక్టర్ షేక్ ఖాసిం పీరా అన్నారు. వైసిపి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు, సినీ దర్శకులు చెరుకూరి సాంబశివరావు అధ్యక్షతన మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయ కర్త బలసాని కిరణ్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లమడ వాగుకట్టమీద ఉన్న పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆడుదాం ఆంధ్రాలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో క్రికెట్, కబడ్డీలో ప్రథమ స్థానంలో నిలిచిన పెదనందిపాడు జట్టు క్రీడాకారులను సత్కరించారు. కార్యక్రమాల్లో ఏబీ పాలెం సొసైటీ చైర్మన్ కూరేటి భూషయ్య, వైస్ ఎంపిపి సాంబశివరావు. సర్పంచ్ దాసరి పద్మారావు, ఉపసర్పంచ్ దివి రాంబాబు, గణేష్, ప్రసాద్, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దుస్తులు అందిస్తున్న ఎంపిపి హెప్సిబా, ఖాసిం పీరా తదితరులు

తెనాలి పట్టణాభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన చర్యలు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణాభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో నిర్వహించారు. చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగిన సమావేశంలో అజెండా ప్రారంభంలోనే 31వ వార్డు కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి లేచి వార్డులో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, అందుకు బాధ్యులైన శానిటరి సెక్రటరీని తన వార్డు నుంచి బదిలీ చేయాలని చైర్పర్సన్‌ను కోరారు. స్పందించిన చైర్పర్సన్ సమావేశం అనంతరం సంబంధిత కార్యదర్శితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తదుపరి అజెండాలోని 33 అంశాలను చదివించి, వాటిని ఆమోదిస్తున్నట్లు ప్రకటించి చైర్పర్సన్ సమావేశాన్ని ముగించారు. వైస్ చైర్మన్‌లు ఎం.హరిప్రసాద్, ఎ.నాగ వేణి, కమిషనర్ ఎం.జశ్వంతరావు, ఎంఇ నాగమల్లేశ్వ రరావు, కౌన్సిలర్‌లు, కో-అప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో కౌన్సిలర్లు.. అధ్యక్ష స్థానంలో చైర్పర్సన్ రాధిక

వృథాగా పోతున్న తాగునీరు



ప్రజాశక్తి-తాడేపల్లి :పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వెనుక బజార్, పద్మశాలీ బజార్, ఆర్ఎంఎస్ కాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీరు వృథాగా పోతోంది. ఇప్పటికీ పట్టణంలోని కొండపై నివశిస్తున్న వారికి తాగునీరు అందక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మరోవైపు మున్సిపల్ ట్యాపుల ద్వారా వెళ్తున్న నీరు వృథాగా డ్రెయినేజీలో కలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో అవసరం లేకపోయినా ట్యాపును వదిలేసి వెళ్లిపోతున్నారు. అనేక ప్రాంతాల్లో మున్సిపల్ ట్యాపుల ద్వారా వెళ్తే నీరు లీకై నీరు మురుగు కాల్వల్లో కలుస్తోంది. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు వెంటనే స్పందించి నీటి వృథాను అరికట్టాలని, కొంత ప్రాంత వాసులకు సరిగా సరఫరా చేయాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుంత



ప్రజాశక్తి-తాడేపల్లి : స్థానిక సాయిబాబా గుడి వద్ద ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. రోడ్డు మధ్యలో గుంత ఏర్పడటంతో గమనించకుండా వస్తున్న వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. అనేక మంది ప్రమాదానికి గురవుతున్నారు. నిత్యం ఈ ప్రాంతం గుండా సిసి యార్డు గోడౌన్స్‌కు భారీ వాహనాలు వివిధ ప్రాంతాలకు యూరియా సరఫరా చేయడానికి వెళ్లి వస్తుంటాయి. పిల్లలను ఎక్కించుకుని పాఠశాల బస్సులు వస్తుంటాయి. పెద్ద ప్రమాదం జరిగి ప్రజలు ఇబ్బంది పడకముందే అధికారులు ఈ గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్

పరిహారం కోసం కలెక్టర్‌కు విన్నవిస్తాం

ప్రజాశక్తి- కొల్లిపర

దుగ్గిరాల కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదం వల్ల పసుపు పంటను నష్టపోయిన రైతులను ప్రభుత్వము వెంటనే ఆదుకోవాలని జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు షేక్ హాసన్ భార్య గుండెపోటుతో మరణించడంతో ఆయన కుటుంబాన్ని మనోహర్ మంగళవారం పరామర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ప్రమాదంపై నిజనిర్ధారణ కమిటీలు వేసి వాస్తవాలను ప్రభుత్వానికి అధికారులు నివేదించాలని కోరారు. రైతులకు పరిహార విషయమై కలెక్టర్‌కు జనసేన ఆధ్వర్యంలో త్వరలోనే విన్నవిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకయ్య నాయుడు, పి.రాంబాబు, బి.కిషోర్‌రెడ్డి, బి.వేణుగోపాల్‌రెడ్డి, ఎ.హరికృష్ణ, బాజీ, బాబి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు టిఫిన్ బండి, తోపుడు బండి అందజేస్తున్న టిడిపి, జనసేన పార్టీల నాయకులు

లోకేశ్ సహకారంతో చిరు వ్యాపారులకు బండ్లు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : కొలనుకొండకు చెందిన కల్ల భారతి, మేఘవత్ లక్ష్మి అద్దె తోపుడు, టిఫిన్ బండ్ల పై చిరు వ్యాపారం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. తమకు సొంత బండ్లు సమకూర్చాలని వారు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు అర్జీ పెట్టుకున్నారు. దీంతో స్పందించిన లోకేశ్ రెండు బండ్లను ఏర్పాటు చేశారు. వాటిని లబ్ధిదార్లకు నాయకులు మంగళవారం అందించారు. కార్యక్రమంలో టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు ఎ.సుబ్బారావు, జనసేన మండల అధ్యక్షులు ఎస్.నాగేశ్వరరావు, కోలనుకొండ గ్రామ టిడిపి అధ్యక్షులు కె.రంగారావు, జనసేన గ్రామ అధ్యక్షులు ఎల్.శ్రీకాంత్, కొలనుకొండ గ్రామ ప్రధాన కార్యదర్శి బి.నాగరాజు, టి.ఏలియా, ఎన్.నాగేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, జి.రంగారావు, కె.శివపార్వతి పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ప్రతిభ

ప్రజాశక్తి - ఎఎన్‌యు : అరుణాచల్‌ప్రదేశ్‌లో ఈనెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని ప్రతిభ కనబరిచారని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ మంగళవారం అభినందించారు. 16 రాష్ట్రాల నుంచి 200 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ నుంచి వర్సిటీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు లిబెస్ట్ డిసిప్లిన్ స్టేట్‌లి అవార్డును, పోస్టర్ పెయింటింగ్లో మూడో బహుమతిని పొందారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వర్సిటీకి పేరు ప్రఖ్యాతలు తెస్తున్నారని, అంకితభావంతో చేసే ఏ పనైనా విజయవంతం అవుతుందని అన్నారు. నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అలవర్చుకోవాలన్నారు. పలు భాషల్లో ప్రావీణ్యం పొంది దేశీయంగా, అంతర్జాతీయంగా రాణించి వర్సిటీ పేరును ఇనుమడింపజేయాలన్నారు. వాలంటీర్లకు డాక్టర్ ఎస్‌కె మహ్మద్ బాష సారథ్యం వహించగా ఎన్ఎస్ఎస్ వర్సిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.రవిశంకర్‌రెడ్డి, వాలంటీర్లు ఎం.హాజస, బి.ఐశ్వర్య, ఎం.శిరీష, భార్గవి, బి.దేవిక, డి.సంతోష్ కుమార్, సిహెచ్.స్వాతి, ఎం.గణేష్ ఉన్నారు.

దుర్గారావు మృతిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం

పరామర్శించిన రాష్ట్ర మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు అర్జున

ప్రజాశక్తి-విజయపురిసౌత్

దుర్గారావు మతి పై గవర్నర్ కు పిర్యాదు చేస్తామని రాష్ట్ర మత్యకారుల సంఘం అధ్యక్షుడు నడకుడితి అర్జున అన్నారు. మంగళవారం విజయపురిసౌత్ లో దుర్గారావు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.దుర్గారావు మృతిపై కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్జున మాట్లాడుతూ చేపలు పట్టుకునే నిరుపేద కుటుంబాన్ని అక్రమ కేసులు పెట్టి వేధించడం దారుణమన్నారు.టీడీపీ కి మద్దతుగా నిలిచే వారిపై అధికార పార్టీ నేతల ఆగడాలు హద్దుమీరాయన్నారు. దుర్గారావు పై అక్రమ కేసు బనాయించి వేధించడం వల్లే ఆత్మహత్య కు పాల్పడ్డాడని చెప్పారు.టీడీపీ నేతలను పార్టీ మారాలని పోలీసులు ఒత్తిడి చేయడం దారుణమన్నారు. దుర్గారావు మృతి పై సిట్టింగ్ జడ్జి తో విచారణ చేపట్టాలని కోరతామన్నారు.

అనంతరం తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు,మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మతుడి కుటుంబ సభ్యులతో ఫోన్ లో మాట్లాడి అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో మచిలీపట్నం జిల్లా మత్యకారుల సంఘం అధ్యక్షుడు కె.రమేష్,టీడీపీ అగ్నికుల క్షత్రియ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవీంద్ర, సింహాచలం,టీడీపీ బెస్త ప్రెసిడెంట్ రామ్ ప్రసాద్,రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి,మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్,నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రం నాయక్, గుండాల శ్రీను,విజయపురిసౌత్ జనసేన పార్టీ అధ్యక్షుడు రాహుల్ పాల్గొన్నారు.



దుర్గారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అర్జున



ఎడీ చంద్రారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సర్వేయర్ల పై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రీ సర్వే సందర్భంగా చిన్న సన్నకారు రైతుల భూములను తక్కువ ఉన్న వారికి ఎక్కువుగా ఎక్కువ ఉన్న రైతులకు తక్కువుగా ఉన్న పత్రాలకు సంబంధం లేకుండా నమోదు చేస్తున్న సర్వేయర్లపై చర్యలు తీసుకోవాలని పిడిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయం ధర్నా చేపట్టి అనంతరం ఎడ చంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. సర్వేలో అక్రమాలకు పాల్పడుతూ ఒకరి భూములు మరొకరికి ఎక్కిస్తున్న వినుకొండ సర్వేయర్ రవి కుమార్, నరసరావుపేట మండలం జొన్నలగడ్డ సర్వేయర్ రామాంజనేయులు పై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా పిడిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి రెవెన్యూ గ్రామంలో సర్వే నెం. 256-బి2,బి1, 256-బి1 లో , 2- 79 సెంట్లు గాను 9 సెంట్లు తగ్గించారని ప్రక్కన ఉన్న వాళ్లకు 8 సెంట్లు అదనంగా నమోదు చేశారన్నారు. ఇదే గ్రామంలో నిసంకి వెంకటేశ్వర్లుకు 2.40 సెంట్లకు 20 సెంట్లు తగ్గించారని యాదాల శ్రీనివాసరావు వివిధ రకాల సర్వే నెంబర్లలో 50 సెంట్లకు పైగా తక్కువ నమోదు చేశారన్నారని ఇదేమని ప్రశ్నించిన రైతులకు సర్వేయర్ రవికుమార్ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని మండిపడ్డారు. కార్య క్రమంలో పిడిఎం రాష్ట్ర నాయకులు జి రామకష్ణ, జిల్లా అధ్య క్షులు షేక్ మస్తాన్ వలి, జిల్లా కార్యదర్శి గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటా నాయక్, నల్లపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.



వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీరామమూర్తికి సన్మానం

ప్రజాశక్తి-మాచర్ల

ఆర్యవైశ్యులు అన్ని రంగాలలో రాణించాలని వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి చెన్నకేశవరావు, పందిరి నరసింహారావులు అన్నారు. ఇటీవల ఎపియుడబ్ల్యూజె నియోజకవర్గ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన కొత్తమాసు శ్రీరామమూర్తిని క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామమూర్తి ఇప్పటికే సేవా భావం కల్గి రాణిస్తున్నట్లు వివరించారు. శ్రీరామమూర్తి పాత్రికేయ సంఘ అధ్యక్షునిగా కూడ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

గుండెపోటుతో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మృతి

ప్రజాశక్తి - దుర్గి



దుర్గి మండల ప్రాధమి క ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సతీష్ మంగళవారం గుండె పోటుతో మృతి చెందారు. దుర్గి లోని తమ నివాసంలో ఒంట రిగా వుంటున్నారు. తెల్లవారుజామున బాత్ రూం లోకి వెళ్లటంతో గుండెపోటు వచ్చి పడిపోయి మృతి చెందినట్లు సమాచారం. సతీష్ ను పలుక రించటానికి వెళ్లిన స్టాప్ వెళ్లగా ఆయన పలకక పోవడంతో వెంటనే ఎస్సైకో టయ్య కు తెలిపారు. ఎస్సై కోటయ్యతన సిబ్బందితో వచ్చి తని ఖీ చేశారు.కిటికీ ని తెరచి చూడగా బాత్ రూంలో పడిపోయివుండటం గమనించారు

'ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు



ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మండలంలోని కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని బ్రాహ్మణపల్లిలో మంగళవారం నిర్వహించారు. గ్రామంలో 553 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ అం దించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశయ్య వైద్యులు అశోక్ కుమార్, కేవీ నాగిరెడ్డి,కె.వి ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కారంపూడి

జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ఫేజ్ - 2 లో భాగంగా మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్ పాల్గొని పరిశీలించారు. నరసరావుపేట ఏరియా హాస్పిటల్ స్పెషలిస్ట్ డాక్టర్లు అలేఖ్య (జనరల్), కోటేశ్వర నాయక్ (ఆర్థోపెడిక్), ప్రసాద్ నాయక్ (కంటి వెలుగు) పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్య శిబిరంలో ఈసీజీ అవసరమైన రోగులకు తీశారు. మొత్తం 516 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పంచాయతి కార్యదర్శి కసన్యా నాయక్, పాల్గొన్నారు.



వైసిపి నాయకులు సిగ్గుపడాలి : టిడిపి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అధికారాన్ని అడ్డం పెట్టుకొని అవినీతి మచ్చలేని చంద్రబాబు నాయుడుపై రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు,కుతంత్రాలు పన్నినా రాష్ట్ర ప్రజలు టిడిపి వెంటే ఉన్నారని టిడిపి పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జివి మాట్లాడుతూ ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబు నాయుడు పై పెట్టిన అక్రమ కేసులో సుప్రీంకోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టన్నారు. సుప్రీం కోర్టు తీర్పుకు రాష్ట్ర ప్రభుత్వం వైసిపి నాయకులు సిగ్గుపడాలన్నారు. వైసిపిపై అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఇప్పటికే పార్టీని వీడుతున్నారని అన్నారు.



మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి

'బిసిలపై దాడులు, అక్రమ కేసులు పెరిగాయి'

ప్రజాశక్తి-మాచర్ల

వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన నుండి బిసిలపై దాడులు పెరిగినట్లు దేశం పార్టీ ఇన్‌చార్జీ జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మాచర్ల టౌన్, రెంటచింతల మండలాల 'జయహో బిసి' సదస్సు జరిగింది. సదస్సులో ముఖ్యఅతిధిగా పాల్గోన్న జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు పార్టీ పెట్టిన నాటి నుండి తెలుగుదేశం పార్టీని బిసిలు తమ సొంత పార్టీగా భావించినట్లు తెలిపారు. ఎన్‌టిఆర్ హయాంలో 24శాతం బిసిల రిజర్వేషన్, తదుపరి చంద్రబాబునాయుడు హయాంలో 34 శాతంకు పెరిగినట్లు వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బిసిలకు 34 శాతం ఉన్న రిజర్వేషన్‌ను తిరిగి 24 శాతంకు కుదించి 16వేల మంది బిసిలకు రాజ్యాధికారం దక్కకుండా చేసినట్లు వివరించారు. కనీసం కుర్చీలు, బల్లాలు లేని కార్పోరేషన్లలను ఏర్పాటు చేసినట్లు ఎద్దేవా చేశారు. మాచర్ల నియోజకవర్గంలో తోట చంద్రయ్య, కంచర్ల జాలయ్యలను అధికార పార్టీ పొట్టనపెట్టుకుందన్నారు. తాజగా మరో బిసి తెలుగుదేశం కార్యకర్త దుర్గారావు ఆత్మహత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ క్రమశిక్షణ సభ్యులు గుంటుపల్లి నాగేశ్వరరావు, నాయకులు నల్లమేకల వెంకటేశ్వర్లు, మద్దిరాల గంగాధర్‌చంద్రశేఖర్, కుర్రి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

మండల పరిధిలోని పలువురు ఎస్‌టిలు వైసిపి పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీ ఇన్‌చార్జీ జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో తాళ్ళపల్లి గ్రామానికి చెందిన ఎస్‌టిలు పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి బ్రహ్మారెడ్డి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మానాయుడు, గుండాల శ్రీనివాస్‌యాదవ్, తాళ్ళపల్లి పార్టీ నాయకులు పాల్గోన్నారు. పార్టీ కార్యాలయంలో గాంధీ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి



ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్యం అహింస ఆయుధాలుగా దేశ స్వాతంత్రం కోసం పోరాటం చేసిన మహనీయుడు మహాత్మా గాంధీ అని సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి కన్నా లక్ష్మీ నారాయణ అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటర్లో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం రాధాకృష్ణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుర్రా హనుమంతరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి-మాచర్ల

పట్టణ ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కౌన్సిలర్ పోలా శ్రీనివాసరావు, చిల్లంచర్ల సత్య నారాయణలు మాట్లాడారు.

ప్రజాశక్తి-వినుకొండ

ఆర్యవైశ్య సంఘం అధ్యర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు గుడివాడ చిన్న గురునాథం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తెల్లాకుల రాజేష్ ఖన్నా,ఆర్యవైశ్య సంఘ నాయకులు మోటమర్రి నరసింహారావు, సన్నీశెట్టి లక్ష్మీనారాయణ,దివ్వెల పుల్లారావు,అడ్డగిరి జగదీష్,మద్ది శ్రీనివాసరావు,గజవల్లి పవన్ కుమార్, మండవ కిరణ్ కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కూడా గాంధీకి నివాళులర్పించారు.

కన్నా పై దాడికి ఖండన

ప్రజాశక్తి-రాజుపాలెం'

ముప్పాళ్ల మండలం తొండపి గ్రామంలో వై యస్ ర్ పార్టీ గుండాలు కన్నా లక్ష్మీనారాయణ పై జరిగిన దాడిని జనసేన మండల పార్టీ అధ్యక్షులు తోట నరసయ్య ఖండించారు. ఈ దాడి అనైతి కమైన చర్య ,పిరికి చర్యని ఆయన మంది పడ్డారు. రాబోయే రోజులలో వై యస్ ర్ పార్టీకి తగిన గుణపాఠం ప్రజలు చెపుతారని ఆయన అన్నారు

డ్రైయినేజీలో వ్యర్థాలు బ్లాక్.. ఇద్దరికి షోకాజులు

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులు, అధికారులపై కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ నందివెలుగురోడ్డు, ఎల్బినగర్, బాలాజీ నగర్, పాత గుంటూరు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. బస్టాండ్‌రోడ్డు, నందివెలుగు రోడ్ మున్సిపల్ స్కూల్ ఎదురు చెత్త కుప్పలు ఉండడం గమనించి సంబంధిత కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్‌బినగర్ కల్వర్ట్ వద్ద అవుట్‌ఫాల్ డ్రెయిన్ వ్యర్థాలతో బ్లాక్ అయి ఉండడంపై శానిటేషన్ సెక్రెటరీ డి.జ్ఞానరత్నం, ఇన్‌స్పెక్టర్ ఎం.ఐజాక్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎంహెచ్‌ఓను ఆదేశించారు. వార్డు సచివాలయం వారీగా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలన్నారు. మధ్యాహ్నం ప్రాధాన్యతా క్రమంలో గ్యాంగ్‌వర్క్ జరగాలని, కార్మికులు, కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు హాజరు నివేదిక ప్రతిరోజూ ఇవ్వాలని ఎంహెచ్‌ఓని ఆదేశించారు. సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు కొందరు విధులకు సక్రమంగా హాజరుకావట్లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, క్షేత్రస్థాయి పర్యటనలో కార్యదర్శులు అనధికారికంగా విధులకు గైర్హాజరైనట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నందివెలుగు రోడ్డు మున్సిపల్ స్కూల్ ఎదురు చెత్త కుప్పలు ఉండడం పై సెక్రెటరి జి.దాసు పై ఆగ్రహం వ్యక్తం చేసి రెండ్రోజుల్లో సదరు ప్రాంతంలో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

అవగాహన కలిగించడం, ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం చేయాలని ఆదేశించారు. ఈ-ఆటోల ద్వారా సేకరించిన వ్యర్థాలను జిటిఎస్‌లకు తరలించేప్పుడు సమయపాలన పాటించాలన్నారు. పర్యటనలో ఎంహెచ్‌ఓ (ఎఫ్‌ఏసి) మధుసూదన్, శానిటరీ సూపర్వైజర్ ఆయుబ్ ఖాన్ పాల్గొన్నారు.

దొంగల ముఠాపై పోలీసులు అప్రమత్తం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఇటీవల సిఎస్ఆర్ కళ్యాణ మండపం సమీపంలో తన కారులో ఇంటికి వెళ్తున్న ఓ డాక్టర్‌పై భవానీ మాల వేసుకున్న కొందరు దుండగులు పట్టపగలు అటకాయించి సహాయం చేయాలని డిమాండ్ చేశారు. పరిస్థితిని గ్రహించిన డాక్టర్ తన కారు స్పీడు పెంచి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని వెంటనే తాడేపల్లి సిఐ మధుసూదనరావు దృష్టికి ప్రజాశక్తి తీసుకెళ్లింది. వెంటనే స్పందించిన ఐడి పార్టీకి కేసును అప్పగించారు. కార్లు, వాహనాలపై వెళ్తున్న వారిని అడ్డగించి విలువైన వస్తువులు తీసుకుని పారిపోవడంతో పాటు నగదును కూడా తస్కరించుకపోయే ముఠాలు తిరుగుతున్నాయని తమ దర్యాప్తులో గమనించినట్లు పోలీసులు తెలిపారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిఐ కోరారు. ఇందులో భాగంగా మంగళవారం పట్టణంలోని సాయిబాబా గుడి ఎదురుగా గుడారాలు వేసుకుని నివశిస్తున్న మహారాష్ట్రకు చెందిన వారిని విచారించారు.



సదస్సుకు హాజరైన అతిథులు, పోలీసులు

ప్రమాద బాధితులకు న్యాయ సాయంపై అవగాహన

ప్రజాశక్తి-తాడేపల్లి

మోటారు వాహన ప్రమాద బాధితులకు ఉచితంగా సత్వర న్యాయం పొందే విధంగా ఎటువంటి మార్గం అనుసరించాలనే దానిపై అమరావతి కరకట్టపై గల చిగురు ఆశ్రమంలో మంగళవారం అవగాహనా కల్పించారు. రాష్ట్ర న్యాయాధికార సేవా సంస్థ నిర్వహించిన సదస్సును ముఖ్యఅతిథిగా హైకోర్టు చీఫ్ జస్టిస్ శేషసాయి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల జరిగిన చట్ట సవరణలు కొనసాగించేందుకు కూడా ఈ అవగాహనా సదస్సు ఉపయోగపడుతుందని తెలిపారు. పోలీస్ డిపార్ట్‌మెంట్, ఇన్సూరెన్స్ అధికారులు, ఆర్‌డిఒలు వెంటనే స్పందిస్తే త్వరితగతిన బాధితులకు న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎపిఎస్‌ఎల్‌ఎస్‌ఎ అడ్వకేట్ సెక్రటరీ భవిత, సీనియర్ అడ్వకేట్ నరేష్, ఎపి జ్యూడిషియల్ అకాడమీ డైరెక్టర్ హరిహరనాథ్‌శర్మ పాల్గొన్నారు.

మహిళల భద్రత, ఆరోగ్యంలో టెక్నాలజీని వాడాలి

కెఎల్‌యులో ముగిసిన రెండ్రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మహిళ భద్రత, ఆరోగ్యం తదితర అంశాలలో ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ప్రముఖ స్త్రీ ప్రసూతి వైద్య నిపుణులు, వెంకటేశ్వర ఫౌండేషన్ వ్యవస్థాపకులు చదలవాడ సుధా అన్నారు. కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలోని ఎపి సైన్స్ సిటీ, ఎన్‌సిసి 10వ ఆంధ్రా బెటాలియన్ సంయుక్తంగా నిర్వహించిన బాలికల వాయిస్-2024 అనే వర్క్‌షాప్‌నకు విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతాలకు చెందిన పలు కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మంగళవారం జరిగిన ముగింపు సభకు సామాజిక కార్యకర్త వేణు ప్రియా, బ్లూ క్రాస్ సొసైటీ నుండి డాక్టర్ పద్మా ప్రియా, ప్రభుత్వ ఆసుపత్రి రిటైర్డ్ సూపరిండెంట్ డాక్టర్ ఎన్.ప్రభావతి, ఎన్‌సిసి 10 వ ఆంధ్రా బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి‌ఎస్.సుదర్శన్ హాజరయ్యారు. మహిళల భద్రత, పునరుత్పత్తి ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం, యుక్త వయస్సులోని బాలికల మానసిక కోణాలపై సాంకేతిక పురోగతిపై వివరించారు. సదస్సుకు ఎన్‌సిసి 10 వ ఆంధ్రా బెటాలియన్ లెఫ్టినెంట్ అసోసియేట్ ఎన్‌సిసి అధికారి పావని కన్వీనర్‌గా వ్యవహరించారు. ప్రో చాన్సులర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు, వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.హనుమంతరావు పాల్గొన్నారు.



డాక్టర్ చదలవాడ సుధను సత్కరిస్తున్న కెఎల్‌యు ప్రతినిధులు

'బీట్ లెప్రసీ' నినాదంతో కుష్టును జయించాలి

ప్రజాశక్తి-తెనాలి, దుగ్గిరాల

ప్రపంచ కుష్టువ్యాధి దినోత్సవం సందర్భంగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఇచ్చిన 'బీట్ లెప్రసీ' నినాదంతో కుష్టువ్యాధిని జయించాలని ఐపిఎస్ఎఫ్ మెంటార్ ప్రొఫెసర్ వై.ఫణికృష్ణ చెప్పారు. ప్రపంచ కుష్టువ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఎఎస్ఎన్ ఫార్మసీ కళాశాల ఐపిఎస్ఎఫ్ విభాగం, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో దుగ్గిరాల మండలం మోరంపూడి గ్రెటనాల్టెస్ హాస్పిటల్‌లో కుష్టువ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కుష్టు సోకిన వారు, ఆ వ్యాధి మరొకరికి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చెప్పారు. తరచుగా డెర్మటాలజిస్ట్ సలహాలతో అందరితో కలిసి జీవించవచ్చునని రోగులకు వివరించారు. అనంతరం రోగులకు పండ్లు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ, కె.కల్యాణచక్రవర్తి, పి.భార్గవి, ఫార్మసి విద్యార్థులు పాల్గొన్నారు. కుష్టు బాధితులకు రోటరీ క్లబ్ గొల్లపూడికి చెందిన జివిఆర్ సురేష్ కుమార్ దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ అధిపతి వంగర హేమ్‌చంద్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులకు సహాయ సహకారాలు అందించడంలో ప్రజలను కూడా భాగస్వాములు కావాలన్నారు. ఫిజియోథెరపిస్ట్ శివ మాట్లాడుతూ శరీరంపై రాగి రంగు, తెలుపు రంగు, స్పర్శ లేని మచ్చలుంటే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలని సూచించారు.

వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా సంపూర్ణ జాతీయకుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలను ఫిబ్రవరి 13 వరకూ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్ తెలిపారు. తెనాలి పట్టణంలో అవగాహన ర్యాలీతోపాటు కుష్టు వ్యాధి లక్షణాలు, వ్యాధి సోకిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. వికసిత్ భారత్ నోడల్ ఆఫీసర్ కె.నాగభూషణం, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె హెలెన్ నిర్మల, వైద్యాధికారి డాక్టర్ వి.మౌనిక కుమార్, ఎ.సంపత్ రాయుడు, ఎం.కనకదుర్గ, హౌసింగ్ ఏఈ పిచ్చయ్య, మెప్మా సిఎంఎంఓ మాధవరావు, ఎ.బాలచంద్రమౌళి, ఐసిడిఎస్ సూపర్వైజర్ కె.సౌజన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, టిబి సూపర్వైజర్ రవికుమార్, ఎఎన్ఎం దెబోరా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కుష్టు నివారణ ర్యాలీలో వైద్య బందం



దుగ్గిరాల మండలం మోరంపూడిలో దుప్పట్లు పంపిణీ



తోపుడు బండ్లు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి

పట్నంలోని చిరు వ్యాపారులకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, మహమ్మద్ హుస్సేన్ కుమారుల సహకారంతో పాత బస్టాండ్ సెంటర్లో 8 మంది చిరు వ్యాపారులకు తోపుడుబండ్లను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, డి.రాజు, టి.పార్ధసారథి, షేక్ రియాజ్, ఎమ్‌డి ఇబ్రహీం, ఎస్.బాలాజీగుప్తా పాల్గొన్నారు.



60 మందికి కుట్టుమిషన్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మంగళగిరి పట్టణం, రూరల్ మండలాల్లో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళగిరి ఎమ్మెస్సెస్ భవన్‌లో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షులు ఎ.భూలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం కుట్టుమిషన్లు, ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. 42వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన 60 మంది మహిళలకు వీటిని అందించారు. కార్యక్రమంలో నాయకులు టి.జానకిదేవి, ఎ.జయసత్య, వి.ఆషాబాల, ఎం.వైష్ణవి, జి.అపర్ణ, బేబీరాణి పాల్గొన్నారు.

'కుల గణన సాహసోపేత నిర్ణయం'

ప్రజాశక్తి - మంగళగిరి

దేశంలోనే బీహార్ తరువాత ఏపీలో జనగణనలో సమగ్ర కులగణన చేయిస్తూ, సాహసోపేత నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి బీసీల తరపున ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా మహిళా కన్వీనర్ కె.స్వాతి గౌడ్, రాష్ట్ర కార్యాలయ ఇన్‌ఛార్జి దానా గౌడ్, నియోజకవర్గ అధ్యక్షులు యు.శ్రీనివాస్, టి.కిరణ్, ఎ.శివాజీ, ఎం.సత్యనారాయణ, నరసింహారావు, డి.నారాయణ, కె.ధనుంజయ్, జె.వరప్రసాద్ పాల్గొన్నారు.

లైన్స్‌క్లబ్ వీల్‌చైర్ వితరణ

ప్రజాశక్తి-తెనాలి



స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి ఆధ్వర్యంలో వీల్ చైర్‌ను స్టేషన్ సూపరింటెండెంట్ టి.వెంకటరమణకు మంగళవారం అందించారు. క్లబ్ అధ్యక్షులు యక్కల రామ్మోహనరావు మాట్లాడుతూ క్లబ్ తరపున నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా క్లబ్ కార్యదర్శి తాళాభక్తుల ఉదయ్ శంకర్ పుట్టిన రోజును పురస్కరించుకొని ఆయన సహకారంతో వీల్‌చైర్‌ను అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ బృందం ఎ.కనకరత్నం, వై.లక్ష్మినారాయణ, లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ వ్యవస్థాపకులు కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలోని 21 ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024-25 సంవత్సరానికిగాను 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో (ఇంగ్లీషు మీడియం)లో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఫిబ్రవరి 23వ తేదీలోగా http//apbragcet.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1 నుండి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఓసి, బిసి, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్ (బిసి-సి) విద్యార్థులు 2013 సెప్టెంబర్ 1 నుండి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. సంబంధిత జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరంలో 3వ తరగతి, 2023-24లో 4వ తరగతి నిరవధికంగా ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువు పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. తల్లిదండ్రుల సంవత్సర ఆదాయ పరిమితి రూ.లక్షకు మించి ఉండరాదని, ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక ఉంటుందని తెలిపారు. 5వ తరగతికి మార్చి 10వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ, ఇంటర్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30 గంటల వరకూ ఉంటుందని, అదనపు సమాచారం కోసం జిల్లా కో-ఆర్డినేటర్‌ను గానీ, దగ్గరలోని గురుకుల పాఠశాలల్లో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పల్నాడు జిల్లాకు కప్ తేవాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా


సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్

రాష్ట్ర స్థాయిలో విశాఖపట్నంలో నిర్వహించే ఆడుదాం ఆంధ్ర క్రీడలలో జిల్లాకు కప్ వచ్చేలా కషి చేయాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ కోరారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్లో ఆడుదాం ఆంధ్రపై సంబంధిత అధికారులతో జెసి మంగళవారం సమీక్షించారు. జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడలను విజయవంతం కోసం ప్రణాళిక ప్రకారం పని చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గం నుండి మహిళా టీములు-5, అదే విధంగా పురుషులు 5 టీములు కలిపి నియోజకవర్గానికి 10 టీముల వంతున మొత్తం 70 టీములు ఈ క్రీడల్లో పాల్గొంటున్నాయన్నారు. ఖోఖో క్రీడలు నరసరావుపేటలోని శంకరభారతిపురం పాఠశాలలో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలను జిల్లా క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడల నిర్వాహణలో వైద్యాఆరోగ్య శాఖ, పోలీసు శాఖ, విద్యా శాఖల సేవలు వినియోగించుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ఈ నెల 6వ తేదీ నుండి విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడల్లోనూ జిల్లా క్రీడాకారులు రాణించి పల్నాడు జిల్లాకు కప్ వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజినల్ అధికారి శేషిరెడ్డి, తహశీల్దార్ రమణ నాయక్, డిఎస్‌డిఓ సురేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ సర్కిల్ ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి



పట్టణంలోని తెనాలి రోడ్డు వెంబడి గల మెహబూబా షంషేర్ ఖాన్ మెమోరియల్ స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ సర్కిల్‌ను రాత్రి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేహదారుఢ్యానికి స్విమ్మింగ్, స్కేటింగ్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో బీసీలు అధికంగా ఉన్నందువలన బీసీలకు టికెట్టు కేటాయిస్తున్నామని, వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయం సాధిస్తుందని చెప్పారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంజి చిరంజీవి పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు తప్పనిసరి

ప్రజాశక్తి-గుంటూరు


విద్యార్థినులకు సర్టిఫికెట్లు ఇస్తున్న కలెక్టర్

గర్భస్థ లింగ నిర్ధారణ చట్టంపై డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో రిజిస్టర్ అయ్యే కొత్త సెంటర్లు, రెన్యువల్ స్కానింగ్ సెంటర్లను తప్పనిసరిగా ప్రోగ్రాం ఆఫీసర్లు దర్శించి తనిఖీ చేయాలన్నారు. సందర్భంగా ఈనెల 24న జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీల్లో గెలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను జేసీ జి.రాజకుమారితో కలిసి అందచేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్‌కు ప్రశంసాపత్రం

ప్రజాశక్తి - మంగళగిరి : కేరళలో ఇటీవల నిర్వహించిన దేశస్థాయి పిల్లల వైద్య నిపుణుల సమావేశాల్లో పట్టణానికి చెందిన డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, యూనిసెఫ్ ఆధ్వర్యంలో ఏడాది కాలంగా పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి కోసం వివిధ జిల్లాలలోని పిల్లల వైద్య నిపుణులకు రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణా తరగతులను నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా తరగతుల నిర్వహణకు కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఇందుకుగాను ఆయన్ను ప్రశంసిస్తూ జాతీయ స్థాయి సమావేశంలో పత్రాన్ని అందించారు. దీంతోపాటు జాతీయ సెమినార్‌లో పాల్గొన్న డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్.. వివిధ రకాల ల్యాబ్ పరీక్షలకు పిల్లలను గురిచేయకుండా తీసుకోవాల్సిన చర్యలు, అవసరమైనప్పుడే చేయాల్సిన పరీక్షలపైనా అవగాహన కల్పించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, సిఐటియు నాయకులు ఎం.బాలాజీ శుభాకాంక్షలు తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి-గుంటూరు


గత రెండు దశాబ్దాలుగా వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి నేటి వరకూ క్రమబద్ధీకరణ చేయకపోవడం చాలా శోచనీయమని ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా అన్నారు. మంగళవారం నగరంపాలెంలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశం ఆయన మాట్లాడుతూ తక్షణమే అన్ని శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందర్నీ కాలయాపన చేయకుండా క్రమబద్ధీకరించాలని కోరారు. గురుకుల పాఠశాలల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 797 మంది ఉపాధ్యాయులు డీఎస్సీ ద్వారా నియమింపబడిన కాంట్రాక్టు ఉపాధ్యాయులు నేటికీ క్రమబద్ధీకరణకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీకి కట్టుబడి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ రెగ్యులర్ చేసి మాట నిలుపుకోవాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పని సమాన వేతనం ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా ఆర్గనైజ్ సెక్రెటరీ కరీముల్లా శాఖాదరి, నగర అధ్యక్షులు వైనాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు బి.శ్రీనివాసరెడ్డి, నాగభూషణం, జాన్ కనకారావు పాల్గొన్నారు

వినుకొండలో ఆటోనగర్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - వినుకొండ



పట్టణంలోని మార్కాపురం రోడ్డు డాలర్ సిటీ పక్కన ఆటో నగర్‌కు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ ప్రకారం వినుకొండ మేకానిక్స్ కోసం 470 మంది సభ్యులతో కూడిన ప్రగతి మోటార్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు రూ.20 కోట్లతో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించామని చెప్పారు. ఆటోనగర్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని, విద్యుత్, డ్రెయినేజీ, ఇతర సదుపాయాల ఏర్పాటుకు సహకరిస్తానని చెప్పారు. లారీ యూనియన్‌కు సైతం ఆరు ఎకరాలను కేటాయించామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి వెంకటరామిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బత్తుల చిన్నప్ప యాదవ్, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, కౌన్సిలర్ గంట కాలేషా, ఏజీపీ ఎంఎం ప్రసాద్, ప్రగతి మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ గంటా సుభాని సెక్రెటరీ కాజా, ట్రెజరర్ షరీఫ్ జాయింట్ సెక్రెటరీ బాజీ పాల్గొన్నారు.



క్యారమ్స్ రాష్ట్ర జట్టుకు తౌసిఫ్ ఎంపిక

ప్రజాశక్తి - చిలకలూరిపేట : ఆంధ్రప్రదేశ్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన విజయవాడలో జరిగిన అండర్-18 బాల, బాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో చిలకలూరిపేట పురుషోత్తమపట్నంలోని ఇంగ్లీష్ మీడియం విద్యార్థి షేక్ తౌసిఫ్ ప్రతిభ చూపినట్లు పిఇటి షేక్ బషీర్ మంగళవారం తెలిపారు. ఐదో స్థానంలో నిలిచిన తౌసిఫ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవగా, పిఇటి బషీర్ రాష్ట్ర జట్టుకు మేనేజర్‌గా నియమితులయ్యారని ప్రిన్సిపాల్ నాగప్రసాద్ తెలిపారు. వచ్చేనెల 9-14 వరకు తమిళనాడులోని మధురైలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టుకు తౌసిఫ్ ప్రాతినిధ్యం వహించనున్నట్లు పాఠశాల డైరెక్టర్ ఓలేటి నాగేశ్వరావు అభినందించారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న కమిషనర్

తాగునీటి సరఫరాలో ప్రజలకు అసౌకర్యం కలిగితే ఉపేక్షించబోమని, ఇంజినీరింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని నగర కమిషనర్ కీర్తిచేకూరి స్పష్టం చేశారు. నగరంలో తాగునీటి సరఫరా, పైప్‌లైన్ల మరమ్మతులపై ఎస్ఇ, ఇంజినీరింగ్ అధికారులతో కమిషనర్ తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా రిజర్వాయర్ల వారీగా ఇంజినీరింగ్ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. కలుషిత నీరు సరఫరా కాకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్సులో ఎస్ఈ, ఈఈలు ఉండవల్లి నుండి వచ్చే నీటి సరఫరా, ఫిల్టరేషన్, ఆలం, క్లోరినేషన్ లను నేరుగా పరిశీలించాలని, బిఆర్ స్టేడియం రిజర్వాయర్ దగ్గర పైప్‌లైన్ లీకు పనులను పూర్తి చేసినందున, బిఆర్ స్టేడియం రిజర్వాయర్, నల్లచెరువు రిజర్వాయర్ల ఏఈలు, డిఈఈలు త్రాగునీటి సరఫరా పునరుద్ధరణ భాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం విలీన గ్రామాలకు తాగునీటిని అందించడానికి అమత్-2పై సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్), సంగం జాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌పై ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ నిర్వహణపై ఆయా విభాగ అధికారులతో సమీక్షించారు. నగరంలో 24/7 తాగునీటి సరఫరా అందించేందుకు రెండు జోన్లను ట్రయిల్ రన్ కోసం ఎంపిక చేయాలని ఎస్ఇని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ (ఎఫ్ఏసి) సుందర్రామిరెడ్డి, ఈఈలు కోటేశ్వరరావు, శ్రీనివాస్, డిఈఈ రఫిక్, ఏఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.

డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడికి నేడు తుమ్మల సాహితీ పురస్కార ప్రదానం

ప్రజాశక్తి-తెనాలి : తుమ్మల వెంకట్రామయ్య సాహితీ పురస్కారాన్ని పట్టణానికి చెందిన ప్రముఖ ప్రవాస భారతీయులు, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి అందుకోనున్నారు. కళల కాణాచి సంస్థ, అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సాయంత్రం 5 గంటలకు నందులపేట కవిరాజా పార్కులోని సీనియర్ సిటిజన్స్ హాల్లో నిర్వహించే కార్యక్రమం ఉంటుందని నిర్వాహక సంస్థ ప్రతినిధులు బుర్రా సాయిమాధవ్, సిహెచ్. సింగారావు తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ గుజ్జర్లమూడి కృపాచారి, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శివప్రసాద్, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ అబ్దుల్ హకీంజాని పాల్గొంటారు. డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి సంస్కృతి, సంప్రదాయాలను ఉటంకిస్తూ రచించిన 'మన వారసత్వం' గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం లభించిందని, గ్రంథంలో తెలుగులో కొత్త పదాలు, జంట పదాలు, తెలుగు జాతిని మలుపుతిప్పిన ఘటనల వంటివి పొందుపరచారని వారు తెలిపారు.